సాక్షి ఒడిశా

గురువారం । 17 । జూలై । 2025



శ్రీ మందిరం ఆదాయం లెక్కింపు

నగదు : రూ. 6,15,446

బంగారం : 1 గ్రాము

వెండి : 3 గ్రాముల 800 మిల్లీ గ్రాములు

– భువనేశ్వర్/పూరీ

నేడు శ్రీ ముఖ సింగారం

భువనేశ్వర్: పూరీ శ్రీ జగన్నాథుని శ్రీ ముఖ సింగారం గురువారం జరుగుతుంది. పవిత్ర శ్రావణ కృష్ణ పక్ష సప్తమి తిథి పురస్కరించుకుని ఈ సేవ నిర్వహిస్తున్నారు. మూల విరాట్లు మసకబారిన ముఖాల అలంకరణ పునరుద్ధరణ కోసం తరచు బొనొకొ లగ్గి నిర్వహించడం ఆచారం. గురువారం ద్వితీయ భోగ మండప సేవ ముగిసిన తర్వాత, సాయంత్రం 6.30 నుంచి రాత్రి 11 గంటల వరకు సుమారు 5 గంటల సేపు సర్వ దర్శనం తాత్కాలికంగా నిలిపి వేస్తామని శ్రీ మందిరం అధికార వర్గాలు తెలిపాయి. బుధవారం ఉదయం శ్రీ మందిరం రత్న వేదికపై కొలువు దీరిన మూల విరాటుల ఉదయం పూట సేవలు పూర్తయిన కాసేపటి తర్వాత ఆలయ ప్రాంగణంలో చంటి పిల్లాడు మూత్ర విసర్జన చేసిన విషయం దృష్టికి రావడంతో శ్రీ జగన్నాథుని మహా స్నానం చేయించి ఆలయ శుద్ధి కార్యకలాపాలు నిర్వహించారు. ఉదయం 7.45 గంటల నుంచి సుమారు 10 గంటల వరకు ఈ ప్రక్రియ కొనసాగడంతో సర్వ దర్శనానికి స్వల్ప అంతరాయం ఏర్పడింది.

న్యూస్‌రీల్

అభివృద్ధి లక్ష్యాలు సాధించాలి



సమావేశంలో పాల్గొన్న కలెక్టర్ కీర్తి వాసన్ తదితరులు

కొరాపుట్: మున్సిపాలిటీల్లో అభివృద్ధి లక్ష్యాలు సాధించాలని కొరాపుట్ జిల్లా కలెక్టర్ వి.కీర్తివాసన్ పిలుపునిచ్చారు. బుధవారం కొరాపుట్ జిల్లా కేంద్రంలోని మున్సిపల్ ఆడిటోరియంలో మున్సిపల్ ప్రజాప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఇంతవరకు అమలవుతున్న పథకాల తీరు, భవిష్యత్‌లో ప్రజలకు అందాల్సిన సేవలు గురించి నేరుగా చెప్పాలని సూచించారు. పెరుగుతున్న పట్టణాల జనాభా ఆధారంగా ప్రభుత్వ సేవలు కూడా ఆధునీకరించాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. సమావేశంలో జిల్లాకు చెందిన మున్సిపల్ చైర్మన్లు లలెటెందు రంజన్ శెఠి (కొరాపుట్), నొరి మహంతి (జయపూర్), శంకరరావు (కోట్‌పాడ్), రాజేంద్ర కుమార్ పాత్రో (సునాబెడా) తదితరులు పాల్గొన్నారు.

దివ్యాంగులకు వీల్‌చైర్ల పంపిణీ



దివ్యాంగులకు వీల్‌చైర్లను పంపిణీ చేస్తున్న దృశ్యం

రాయగడ: జిల్లాలోని కాసీపూర్ సమితి కార్యాలయం ప్రాంగణంలో బుధవారం నిర్వహించిన భీమ్‌బోయ్ దివ్యాంగుల శిబిరంలో నలుగురు దివ్యాంగులకు జిల్లా సామాజిక సంక్షేమ శాఖ వీల్‌చైర్లను పంపిణీ చేసింది. అదేవిధంగా మరో ఇద్దరికి వినికిడి యంత్రాలను అందజేసింది. కార్యక్రమంలో బీడీవో బిజయ్ కుమార్, జిల్లా సామాజిక సంక్షేమ శాఖ అధికారి శ్రీకాంత్ పాణిగ్రహి, రాయగడ దివ్యాంగుల సంఘం సాధారణ కార్యదర్శి అమరేంద్రనాథ్ తదితరులు పాల్గొన్నారు.

మాజీ ఎంపీ దంపతుల ఔదార్యం



క్షత గాత్రుడిని స్వయంగా వీల్ చైర్‌లో ఆస్పత్రికి తీసుకెళ్తున్న మాజీ ఎంపీ జిన్ను హిక్కా దంపతులు

కొరాపుట్: రోడ్డు ప్రమాద బాధితుడిని మాజీ ఎంపీ దంపతులు వైద్య కళాశాలకు తీసుకెళ్లారు. బుధవారం కొరాపుట్ మాజీ ఎంపీ జిన్ను హిక్కా ,అతని సతీమణి సీనియర్ బీజేడీ నాయకురాలు కౌసల్య హిక్కాలు కొరాపుట్‌లో ప్రయాణం చేస్తున్నారు. సునాబెడా రోడ్డులో డీఐజీ ఆఫీస్ ఎదుట ఒక బైక్ చోదకుడు ప్రమాదంలో గాయపడి రోడ్డుపై పడి ఉన్నాడు. ఇది గమనించిన వీరిద్దరూ వాహనం ఆపి క్షతగాత్రుడిని రోడ్డు పక్కకు చేర్చారు. తమ వాహనంలోనే కొరాపుట్ ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ఆస్పత్రిలో స్వయంగా వీల్‌చైర్‌లో కూర్చోబెట్టి లోపలకు తీసుకెళ్లారు.

'ప్రభుత్వానిదే బాధ్యత'



రాయగడ: కళాశాల కూడలిలో బీజేడీ శ్రేణుల ఆందోళన

రాయగడ: ఫకీర్ మోహన్ సేనాపతి కళాశాల సౌమ్య శ్రీ ఆత్మాహుతికి ప్రభుత్వమే బాధ్యత వహించాలని గుణుపూర్ మాజీ ఎమ్మెల్యే రఘునాథ్ గొమాంగొ ఆరోపించారు. ఈ మేరకు గుణుపూర్‌లోని కాలేజీ కూడలిలో ఆయన ఆధ్వర్యంలో బీజేడీ శ్రేణులు నిరసన చేపట్టాయి. కార్యక్రమంలో వివిధ పాఠశాలలు, కళాశాలలకు చెందిన విద్యార్థినులు పాల్గొన్నారు.

సౌమ్యశ్రీ ఆత్మహత్యపై క్రైమ్ శాఖ దర్యాప్తు

భువనేశ్వర్: బాలాసోర్ ఫకీర్ మోహన్ కళాశాల విద్యార్థి సౌమ్యశ్రీ బిసి ఆత్మాహుతి మరణంపై రాష్ట్ర క్రైమ్ శాఖ దర్యాప్తు చేస్తుందని క్రైం శాఖ డైరెక్టరు జనరల్ బినయ్‌తోష్ మిశ్రా ఈ విషయం తెలిపారు. మహిళ, శిశు నేరాల నివారణ విభాగం ఇన్‌స్పెక్టర్ జనరల్ ఎస్.సాయిని ప్రత్యక్ష పర్యవేక్షణలో డీఎస్పీ ఇమాన్ కల్యాణ్ నాయక్‌తో కూడిన ప్రత్యేక బృందం సమగ్ర దర్యాప్తు జరుగుతుందని వివరించారు.

బాలాసోర్ టు భువనేశ్వర్

- బీజేడీ గర్జన
- విద్యార్థిని మృతిపై రాష్ట్రమంతా ఆందోళనలు
- ఆందోళన చేస్తూ ఆస్పత్రి పాలైన మాజీ మంత్రులు



ఆస్పత్రిపాలైన బీజేడీ నాయకుడు ప్రణబ్ ప్రకాష్ దాస్



బాలాసోర్ పట్టణం నడి బొడ్డున బీజేడీ నిరసన సభ

భువనేశ్వర్: బాలాసోర్ ఫకీర్ మోహన్ కళాశాల విద్యార్థిని సౌమ్యశ్రీ బీసీ మృతికి నిరసనగా రాష్ట్రంలో విపక్షం బిజూ జనతా దళ్ ఘటనా స్థలం బాలాసోర్ నుంచి రాజధాని భువనేశ్వర్ వరకు ఏక కాలంలో తార స్థాయిలో ఆందోళన కొనసాగిస్తోంది. ఈ ఆందోళనల్లో ఇద్దరు మాజీ మంత్రులు గాయపడి ఆస్పత్రిలో చేరారు. పలువురు కార్యకర్తలు పోలీసు దెబ్బలు తిన్నారు. బుధవారం బాలాసోర్ బంద్, రాజధానిలో లోక్ సేవా భవన్ ముట్టడి ఆందోళనలతో పరిసరాలు దద్దరిల్లాయి. పార్టీ కార్యకర్తలను ఘెరావ్ చేయడానికి ప్రయత్నించగా, బీజేడీ సీనియర్ నాయకులు ప్రణబ్ ప్రకాష్ దాస్ అలియాస్ బాబీ దాస్, ప్రీతిరంజన్ ఘొడై గాయపడి ఆస్పత్రి పాలయ్యారు. బాధిత కుటుంబానికి రూ. 2 కోట్ల పరిహారం చెల్లించాలని, ముఖ్యమంత్రి మోహన్ చరణ్ మాఝి, ఉన్నత విద్యా విభాగం మంత్రి సూర్య వంశీ సూరజ్ పదవులకు రాజీనామా చేయాలని నిరసనకారులు డిమాండ్ చేస్తున్నారు.

ఫకీర్ మోహన్ కళాశాల విద్యార్థినికి న్యాయం జరగాలనే పట్టుతో బిజూ జనతా దళ్ స్థానిక లోక్ సేవా భవన్ ముట్టడి ఆందోళన చేపట్టింది. రాష్ట్ర ప్రభుత్వం పోలీసు బలగాలను మోహరించి నీటి ఫిరంగులు, భాష్ప వాయువు ప్రయోగించి ఆందోళన ఆపడానికి ప్రయత్నించింది. ఇది ప్రభుత్వం అసమర్థత, అప్రజాస్వామ్య పాలనకు నిదర్శనంగా విపక్ష బిజూ జనతా దళ్ దుయ్యబట్టింది. బాలాసోర్ ఫకీర్ మోహన్ కళాశాల విద్యార్థికి న్యాయం కోసం ప్రారంభించిన ఈ పోరాటం ఆగదని, అవాంఛనీయ బలవంతపు చర్యలు, బల ప్రయోగాలను ఎదురీది నిరవధికంగా ఆందోళన కొనసాగిస్తామని ఆందోళనకారులు హెచ్చరించారు.

పోలీసుల అప్రజాస్వామిక చర్యలతో మాజీ మంత్రులు ప్రణబ్ ప్రకాష్ దాస్ (బాబీ), ప్రీతిరంజన్ ఘొడై తీవ్రంగా గాయపడ్డారు. ప్రణబ్ ప్రకాష్ దాస్ అపోలో ఆస్పత్రిలో చేరగా, ప్రీతిరంజన్ ఘొడైని క్యాపిటల్ ఆస్పత్రికి తరలించారు. పోలీసులు, బీజేడీ ఆందోళనకారుల మధ్య జరిగిన ఘర్షణలో మహిళా నాయకురాలు సులతా దేవ్ గాయపడ్డారు. వందలాది మంది బిజూ జనతా దళ్ కార్యకర్తలను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు.



కాలి గాయంతో ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న మాజీ మంత్రి ప్రీతి రంజన్ ఘొడై



బాలాసోర్ రాజా చౌరస్తాలో నిరసన సెగ



ఆందోళనకారులపై ఫిరంగులతో నీటి ప్రయోగం



ఆందోళనకారులపై పోలీసుల బలప్రయోగం



ప్రముఖుల సారథ్యంలో బీజేడీ గర్జన

బాలాసోర్ బంద్ విజయవంతం

ఆత్మాహుతితో తనువు చాలించిన సౌమ్యశ్రీ బీసీకి న్యాయం చేయాలని భొగొరాయి తాణా చౌరస్తాలో బుధవారం బిజూ జనతా దళ్ భారీ నిరసన ర్యాలీ నిర్వహించింది. ఈ సందర్భంగా నిర్వహించిన బహిరంగ సభలో సౌమ్యశ్రీకి న్యాయం చేయడంలో, ఆమె ప్రాణాలను కాపాడడంలో రాష్ట్రంలో భారతీయ జనతా పార్టీ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని ఆందోళనకారులు ప్రసంగించారు. న్యాయం కోసం అధ్యాపకుల నుంచి ముఖ్యమంత్రి, శాసన సభ, పార్లమెంటు సభ్యులు, ప్రభుత్వ అధికారులు, పోలీసుల్ని సైతం మొర పెట్టుకున్నా ఆమెకు న్యాయం జరగలేదు. ఈ దుస్థితికి రాష్ట్ర ప్రభుత్వం పూచీదారితనం వహించి వైదొలగాలని ఆందోళనకారులు డిమాండు చేశారు. ప్రభుత్వ వైఫల్యానికి నిరసనగా బీజేడీ పిలుపునిచ్చిన బాలాసోర్ బంద్‌కు స్థానికులు సానుకూలంగా స్పందించి దివంగత విద్యార్థిని ఆత్మకు నివాళులర్పించి బంద్‌ని విజయవంతం చేశారని తెలిపారు. బంద్ ప్రభావంతో అత్యవసర సేవలు మినహా ఇతర సేవలు అన్ని స్తంభించిపోయాయి.



లోక్ సేవా భవన్ ముట్టడికి బిజూ జనతా దళ్ ఆందోళన

• సర్వత్రా ఆందోళనలు



నబరంగ్‌పూర్ మెయిన్ రోడ్డులో మాఘరో సంస్థ మహిళల ర్యాలీ

కొరాపుట్: సౌమ్యశ్రీ ఆత్మాహుతిపై కొరాపుట్, నబరంగ్‌పూర్ జిల్లాల వ్యాప్తంగా ఆగ్రహావేశాలతో కూడిన ఆందోళనలు కొనసాగుతున్నాయి. నబరంగ్‌పూర్ జిల్లా కేంద్రంలోని మెయిన్ రోడ్డులో ఉన్న జిల్లా కాంగ్రెస్ కార్యాలయంలో విద్యార్థిని చిత్రపటం ముందు ప్రముఖులు నివాళులర్పించారు. మాఘరో సంస్థ కన్వీనర్ కాదంబని త్రిపాఠి నేతృత్వంలో మహిళలు పెద్ద ఎత్తున్న ర్యాలీ నిర్వహించారు. బందుగాం సమితిలో గురువారం బంద్ కోసం ముందస్తుగా కాంగ్రెస్ కార్యకర్తలు పాఠశాలలను లేఖలు అందజేశారు. బొయిపరిగుడ సమితి కేంద్రంలో కొవ్వొత్తులతో నివాళులర్పించారు. జయపూర్ మెయిన్ రోడ్డులో డీసీసీ కార్యాలయం ముందు కాంగ్రెస్ కార్యకర్తలు కొవ్వొత్తులతో నివాళులర్పించారు.



నారాయణ పట్న రాధాకృష్ణ విద్యాలయంలో నివాళులు

• మరమ్మతులు ప్రారంభం



అండర్ గ్రౌండ్ రహదారి మరమ్మతులు చేపడుతున్న దృశ్యం

రాయగడ: స్థానిక మెయిన్ మార్కెట్ నుంచి సబ్ కలెక్టర్ కార్యాలయం, రాణిగుడఫారానికి అనుసంధానించే రైల్వే అండర్ గ్రౌండ్ రోడ్డు మరామ్మతు పనులను రైల్వే శాఖ బుధవారం నుంచి ప్రారంభించింది. గత కొద్దిరోజులుగా ఈ మార్గంలో రహదారి పూర్తిగా అధ్వానంగా మారడంతో పాటు అండర్ గ్రౌండ్ కింద గుంతలు ఏర్పడడంతో వాహనాల రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు కలుగుతున్నాయి. సమస్యలు వివిధ పత్రికల్లో ప్రచురితమవ్వడంతో రైల్వేశాఖ అధికారులు స్పందించారు. ప్రస్తు తం ఈ మార్గంలో మరమ్మతులు జరుగుతున్న నేపథ్యంలో వాహన రాకపోకలు నిలిపివేశారు. ఈనెల 28 వరకు పనులు కొనసాగుతాయని పేర్కొన్నారు. దీంతో వాహనాలు ఫ్లై ఓవర్ బ్రిడ్జి మీదుగా వెళ్తున్నాయి. అయితే ఫ్లై ఓవర్‌పై వాహన రాకపోకల వలన రద్దీ ఏర్పడింది.

• దుకాణం దగ్ధం



దుకాణం కాలిపోతున్న దృశ్యం



దుకాణంలో పూర్తిగా కాలిపోయిన సామాన్లు

మల్కన్‌గిరి: మల్కన్‌గిరి జిల్లా కలిమెల సమితి పోట్టేర్ చిత్రాంగ్‌పల్లి పంచాయతీ పరిధిలోని మార్కెట్ చౌక్ వద్ద గల ఓ గిఫ్ట్ షాపు బుధవారం మధ్యాహ్నం షార్ట్ సర్క్యూట్‌తో అగ్ని ప్రమాదానికి గురైంది. షాపులో ఉన్న వస్తువులన్నీ కాలిపోయాయి. రూ.6 లక్షల వరకు ఆస్తినష్టం సంభవించింది. ప్రభుత్వం తమను ఆదుకోవాలని యజమాని గీతారాణి దాస్ కోరారు.

రబ్బరు తూటాలు ప్రయోగించ లేదు: పోలీసు కమిషనరు

భువనేశ్వర్: బాలాసోర్ విద్యార్థిని ఆత్మాహుతి మృత్యు సంఘటనకు నిరసనగా బిజూ జనతా దళ్ బుధవారం నిర్వహించిన లోక్ సేవా భవన్ ముట్టడి ఆందోళనలో రబ్బరు తూటాల్ని ప్రయోగించ లేదని జంట నగరాల పోలీసు కమిషనరు సురేష్ దేవదత్త సింగ్ తెలిపారు. ఆందోళన కట్టడి చర్యల్లో భాగంగా 5 భాష్ప వాయు సెల్స్, నీటి ఫిరంగుల్ని ప్రయోగించినట్లు వివరించారు. నిరసనకారులు అడ్డుకట్టల్ని అధిగమించడాన్ని నివారించే ప్రయత్నంలో ఇరు వర్గాల మధ్య స్వల్ప తొక్కిసలాట చోటు చేసుకుంది. ఆందోళన సమగ్ర దృశ్యాలపై డ్రోన్ నిఘా ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు.

'సీఎం రాజీనామా చేయాలి'

జయపురం: బాలేశ్వర ఫకీర్ మోహన్ కళాశాల విద్యార్థిని ఆత్మహత్యకు బాధ్యత వహించి సీఎం మోహన్ చరణ్ మాఝి, కేంద్ర విద్యామంత్రి ధర్మేంద్ర ప్రధాన్, రాష్ట్ర విద్యామంత్రి, బాలేశ్వర్ ఎంపీలు రాజీనామా చేయాలని కొరాపుట్ జిల్లా కమ్యూనిస్టు పార్టీ డిమాండ్ చేసింది. ఈ సంఘటనపై మంగళవారం పార్టీ శ్రేణులు జయపురం ప్రధాన కూడలి వద్ద ర్యాలీ చేశాయి. కార్యక్రమంలో కమ్యూనిస్టు పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కార్మిక నేత ప్రమోద్ కుమార్ మహంతి మాట్లాడుతూ విద్యార్థిని సౌమ్యశ్రీ తాను చదివే కళాశాల విభాగ ప్రధాన అధ్యాపకుని ద్వారా లైంగిక దాడికి గురై ఆ విషయం కళాశాల ప్రిన్సిపాల్‌కు ఫిర్యాదు చేసిందని వెల్లడించారు. అలాగే కేంద్ర విద్యామంత్రి ధర్మేంద్ర ప్రధాన్, సీఎం మోహన్ చరణ్, ఉన్నత విద్యామంత్రి, బాలేశ్వర ఎంపీ, ఎమ్మెల్యేలకు కూడా ఫిర్యాదు చేసిందని అయినా ఎవరూ స్పందిచలేదని తెలిపారు. అందుకే కాలేజీ ఆవరణలోనే పెట్రోల్ పోసుకుని ఆత్మహత్యకు పాల్పడిందని పేర్కొన్నారు. ఆ విద్యార్థిని ఏబీవీపీ సభ్యురాలని, అయినా రాష్ట్రపతి పర్యటనకు ఇచ్చిన విలువ ఆ విద్యార్థిని ప్రాణాలకు ఇవ్వలేదని తెలిపారు.

ఉత్కళ ఓంఫెడ్ ఉద్యోగుల ఆందోళన



ఆందోళనలో పాల్గొన్న జయపురం ఓంఫెడ్ ఉద్యోగులు

జయపురం: జయపురం రైల్వే స్టేషన్ ప్రాంతంలో గల ఓం ఫెడ్ ఉద్యోగులు తమ డిమాండ్ల సాధనకొరకు నిరవధిక పని నిలుపు ఆందోళన చేపట్టారు. రైల్వే స్టేషన్–సేవా పేపరుమిల్లు మార్గంలో గల ఉత్కళ ఓంఫెడ్ పాలపేనెట్ ప్రాసెసింగ్ కర్మాగారం ముందు ఓం ఫెడ్ ఉద్యోగులు ఆందోళన చేపట్టారు. ఉత్కళ కర్మచారి సంఘం పిలుపు మేరకు జయపురం ఓంఫెడ్ ఉద్యోగులు కార్యాలయం ముందు ధర్నా చేశారు. రెండున్నరేళ్లుగా విజ్ఞప్తి చేస్తున్నా పట్టించుకోవడం లేదన్నారు. ఓంఫెడ్ సంస్థలో 217 పదవులు ఖాళీగా ఉన్నా వాటిని యాజమాన్యం భర్తీ చేయడం లేదన్నారు.

బంద్ విజయవంతం చేయండి



మాట్లాడుతున్న నరేంద్ర కుమార్ మహంతి

జయపురం: బాలేశ్వర్‌లోని పీఎం స్వయం ప్రతిపత్తి కళాశాల విద్యార్థిని మరణానికి కారణమైనవారిపై కఠిన చర్యలు తీసుకోవాలని, బాధిత కుటుంబానికి న్యాయం చేయాలని, ఆమె మరణానికి బాధ్యత వహించి రాష్ట్ర ముఖ్యమంత్రి మోహన్‌చరణ్ మాఝి రాజీనామా చేయాలని కోరుతూ గురువారం చేపట్టనున్న రాష్ట్ర బంద్‌ను విజయవంతం చేయాలని కొరాపుట్ జిల్లా కాంగ్రెస్ పార్టీ, జిల్లా కమ్యూనిస్టు పార్టీలు సంయుక్తంగా బుధవారం నిర్వహించిన పత్రికా ప్రతినిధుల సమావేశంలో పిలుపునిచ్చాయి. స్థానిక జిల్లా కాంగ్రెస్ భవనంలో జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు శశిభూషణ పాత్రో అధ్యక్షతన జరిగిన సమావేశంలో జయపురం మున్సిపల్ చైర్మన్ నరేంద్ర కుమార్ మహంతి మాట్లాడారు. విద్యార్థిని మృతికి న్యాయం జరగాలని కోరుతూ అఖిల ఒడిశా బందుకు కాంగ్రెస్ పార్టీ పిలుపునిచ్చిందని తెలియజేశారు. బంద్‌లో జిల్లాలోని ఉద్యోగ సంఘాలు, కార్మిక సంఘాలు, మోటారు వర్కర్స్ యూనియన్లు, ప్రైవేట్ బస్సు యజమానుల సంఘం, లారీ ఓనర్స్ యూనియన్, చాంబర్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీస్‌లు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. సమావేశంలో కొరాపుట్ జిల్లా కమ్యూనిస్టు పార్టీ కార్యదర్శి జుధిష్టర్ రౌళో, నరేంద్రకుమార్ మహంతి, కాంగ్రెస్ సీనియర్ నేత మదన మోహన్‌నాయిక్, కొరాపుట్ మున్సిపల్ మాజీ చైర్మన్ భగవాన్ బాహిణీపతి, కొరాపుట్ జిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు నళినీ రథ్, మానస్వినీ టక్రి, నిహార్ రంజన్ బిశాయి తదితరులు పాల్గొన్నారు.

'పెండింగ్ ప్రాజెక్టులు పూర్తి చేయండి'



సమీక్ష సమావేశంలో పాల్గొన్న ఎమ్మెల్యేలు, కలెక్టర్ పట్వారి తదితరులు

రాయగడ: జిల్లాలోని గుణుపూర్, రాయగడలో గల సమగ్ర గిరిజనాభివృద్ధి సంస్థ (ఐటీడీఏ) ల ద్వారా జిల్లాలో కొనసాగుతున్న వివిధ ప్రాజెక్టులకు సంబంధించి బుధవారం సమీక్ష జరిగింది. కలెక్టర్ ఫరూల్ పట్వారి అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో రాయగడ ఎమ్మెల్యే అప్పల స్వామి కద్రక, బిసంకటక్ ఎమ్మెల్యే నీలమాధవ హికక, గుణుపూర్ ఎమ్మెల్యే సత్యజీత్ గొమాంగొ, జిల్లా పరిషత్ అధ్యక్షురాలు సరస్వతి మాఝి, జిల్లా పరిషత్ ముఖ్యకార్యనిర్వాహణ అధికారి అక్షయ కుమార్ ఖెముండొ, డీఎఫ్‌ఓ అన్నా సాహెబ్ అహలే ఇతర అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ పట్వారి మాట్లాడుతూ జిల్లాలో గల రెండు ఐటిడిఏ పరిధుల్లో చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలు, చేపట్టనున్న ప్రాజెక్టుల గురించి సంబంధిత శాఖ అధికారులను అడిగి వివరాలు తెలుసుకున్నారు. పెండింగుల్లో ఉన్న ప్రాజెక్టు పనులను త్వరిత గతిన పూర్తి చేయాలని ఆమె ఆదేశించారు. ఈ సందర్భంగా ప్రజా ప్రతినిధులు జిల్లాలో గల ఆదివాసీ, హరిజన విద్యార్థులు చదువుకుంటున్న సంక్షేమ శాఖ పరిధుల్లోని హాస్టళ్లు, పాఠశాలల్లో రక్షణ కరువైందని ఆరోపించారు. సీసీ కెమెరాలు పెట్టాలని డిమాండ్ చేశారు.

'పదవుల నుంచి దిగిపోవాలి'

కొరాపుట్: బాలేశ్వర్ ఫకీర్ మోహన్ కాలేజీ విద్యార్థిని సౌమ్యశ్రీ విన్నపాలు పట్టించుకోని పాలకులు పదవుల నుంచి దిగిపోవాలని ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ ఉపాధ్యక్షుడు, జయపూర్ ఎమ్మెల్యే తారా ప్రసాద్ బాహిణీపతి డిమాండ్‌చేశారు. రాష్ట్రపతి పర్యటన తర్వాత ఆమె మృతిని ప్రభుత్వం ప్రకటించిందని అన్నారు. అందుకే ఈ నెల 17న రాష్ట్ర బంద్‌కు పిలుపునిచ్చామన్నారు. దీనిపై సీబీఐతో దర్యాప్తు చేయించాలని కోరారు. ఏబీవీపీ ఈ ఘటనపై ఎందుకు మౌనం వహిస్తోందని ప్రశ్నించారు.



మీడియాతో మాట్లాడుతున్న తారా ప్రసాద్ బాహిణీపతి

క్లుప్తంగా

వైద్య శిబిరం ఏర్పాటు



రక్తపరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు

టెక్కలి రూరల్: గూడెం పంచాయతీ సన్యాసి నీలాపురంలో బుధవారం వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. 'నీలాపురంలో జ్వరాలు' శీర్షికన సాక్షిలో కథనం ప్రచురితమైంది. దీనిపై స్పందించిన వైద్య సిబ్బంది గ్రామానికి వెళ్లి బావులు, రోడ్డుకు ఇరువైపులా క్లోరినేషన్ చేయించారు. లింగాలవలస పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ పవన్‌తేజ ఆధ్వర్యంలో మెడికల్ క్యాంపు ఏర్పాటు చేశారు. రక్తపరీక్షలు నిర్వహించి మందులు అందజేశారు. కార్యక్రమంలో వైద్యసిబ్బంది పాల్గొన్నారు.

ఆన్‌లైన్ గేమ్స్‌లో నష్టపోయి వ్యక్తి ఆత్మహత్య



మజ్జి బుజ్జి(ఫైల్)

హిరమండలం: గులుమూరు గ్రామానికి చెందిన మజ్జి బుజ్జి (40)గడ్డిమందు తాగి బుధవారం మృతిచెందాడు. హిరమండలం ఎస్సై ఎండీ యాసీన్ తెలిపిన వివరాల ప్రకారం.. బుజ్జి హిరమండలంలోని టాటా ప్లాంట్‌లో సూపర్‌వైజర్‌గా పని చేస్తుండేవాడు. ఆన్‌లైన్ గేమ్స్‌లో నష్టపోయి అప్పుల పాలయ్యాడు. మానసిక ఒత్తిడికి గురై మనస్తాపం చెంది మంగళవారం గడ్డి మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. వెంటనే కుటుంబ సభ్యులు శ్రీకాకుళంలో ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చేర్పించగా చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందాడు. భార్య భాగ్యలక్ష్మి ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎస్సై కేసు నమోదు చేశారు.

కారుణ్య నియామకాలకు కౌన్సెలింగ్



కౌన్సెలింగ్ నిర్వహిస్తున్న జేసీ

శ్రీకాకుళం పాతబస్టాండ్: కారుణ్య నియామకం ద్వారా ఉద్యోగాలు పొందుతున్న వారు సమర్థంగా బాధ్యతలు నిర్వర్తించాలని జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్‌ఖాన్ అన్నారు. బుధవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో వివిధ ప్రభుత్వ శాఖల్లో విధి నిర్వహణలో ఉంటూ మృతి చెందిన వారి కుటుంబ వారసులకు కారుణ్య నియామకాల కౌన్సెలింగ్ చేపట్టారు. 42 మంది అభ్యర్థులు హాజరుకాగా రోస్టర్, రిజర్వేషన్, ఇతర అంశాలను పరిగణనలోకి తీసుకొని 32 మందికి నియామక పత్రాలు అందజేశారు. వీరిలో 24 మంది టైపిస్టులు, ఐదుగురు జూనియర్ అసిస్టెంట్లు, ముగ్గురు ఆఫీస్ సబార్డినేట్లు ఉన్నారు. కార్యక్రమంలో డీఆర్‌వో ఎం.వెంకటేశ్వరరావు, కలెక్టరేట్ ఏఓ ఎం.వి.సూర్యనారాయణ, డీటీ ఢిల్లేశ్వరరావు, రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

నిర్లక్ష్యమే ప్రాణం తీసింది

అరసవల్లి: కుక్క కాటు వేసినా నిర్లక్ష్యంగా వ్యవహరించడం వల్లే మురపాకలో 24 ఏళ్ల కుర్రాడు మృతిచెందినట్లు డీఎంహెచ్‌ఓ డాక్టర్ అనిత బుధవారం తెలిపారు. ఏప్రిల్ 18న కుక్క కాటుకు గురైతే వ్యాక్సిన్ వేసుకోకుండా నిర్లక్ష్యం వహించాడని పేర్కొన్నారు. ఎవరైనా కుక్కకాటు బారిన పడితే కచ్చితంగా వ్యాక్సిన్ వేయించుకోవాలని స్పష్టం చేశారు. మురపాక పీహెచ్‌సీ ఈ కేసు రిపోర్టు కాలేదన్నారు. జిల్లాలో అన్ని పీహెచ్‌సీల్లో ఏఆర్‌వీ వ్యాక్సిన్లు అందుబాటులో ఉన్నాయని చెప్పారు.

సిక్కోలు వేదికగా రాష్ట్రస్థాయి చెస్‌పోటీలు

శ్రీకాకుళం న్యూకాలనీ: నగరంలోని పీఎన్ కాలనీలో ఉన్న న్యూ సెంట్రల్ స్కూల్ వేదికగా ఈ నెల 20న రాష్ట్రస్థాయి స్కూల్స్ ర్యాంకింగ్ చెస్ పోటీలు జరగనున్నాయని ఆలిండియా చదరంగ సమాఖ్య చెస్ ఇన్ స్కూల్స్ కమిటీ సభ్యుడు సనపల భీమారావు బుధవారం తెలిపారు. వివిధ జిల్లాలకు చెందిన సుమారు 200 మంది విద్యార్థులు పాల్గొనే అవకాశం ఉందన్నారు. జిల్లాలోని అన్ని పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులు వారి ప్రావీణ్యతను పరీక్షించుకోవచ్చన్నారు. 6 నుంచి 16 ఏళ్ల బాలబాలికలకు 12 కేటగిరీల్లో పోటీలు జరుగుతాయని వెల్లడించారు. ముందుగా ఏపీచెస్.ఓఆర్జీ వెబ్‌సైట్‌లో పేర్లు నమోదు చేసుకోవాలని. పూర్తి వివరాలకు 9912559735 నంబర్‌ను సంప్రదించాలని కోరారు.

సారా ప్యాకెట్లు స్వాధీనం

కంచిలి: అరవ సరియాపల్లి గ్రామానికి చెందిన బొండాడ మోహిని అనే మహిళ నాటుసారా అమ్ముతున్నట్లు వచ్చిన సమాచారం మేరకు సోంపేట ఎక్సైజ్ సీఐ జి.వి. రమణ సిబ్బందితో కలిసి బుధవారం దాడులు నిర్వహించారు. ఆ సమయంలో ఆమె 80 సారా ప్యాకెట్లను విడిచిపెట్టి పారిపోయింది. వాటిని స్వాధీనపర్చుకొని మహిళపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. మూడు, అంతకంటే ఎక్కువ కేసులు ఉంటే వారిపై పి.డి.యాక్టు పెట్టేందుకు ప్రయత్నాలు చేస్తున్నామని చెప్పారు. ఈ దాడుల్లో సీఐతో పాటు కానిస్టేబుళ్లు మార్కారావు, భానుప్రసాద్, ఉమాపతి పాల్గొన్నారు.

న్యాయ పోరాటం.. ప్రజాస్వామ్య హక్కు

- నవీన్ పట్నాయక్



భువనేశ్వర్: న్యాయం కోసం పోరాడడం ప్రజల ప్రజాస్వామ్య హక్కు. ఈ హక్కుని రాష్ట్ర పోలీసులు నిర్దాక్షిణ్యంగా కాలరాశారు. బాలాసోర్ ఫకీర్ మోహన్ కళాశాలలో 20 ఏళ్ల యువతి ఆత్మాహుతి మృతి పట్ల బిజూ జనతా దళ్ ప్రజాస్వామ్యబద్ధంగా ఆందోళన కొనసాగిస్తుండగా.. పోలీసులు రబ్బరు తూటాల్ని ప్రయోగిం అన్యాయంగా గాయపరిచారని విపక్ష నేత, బిజూ జనతా దళ్ అధ్యక్షుడు నవీన్ పట్నాయక్ ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్రంలో ప్రజాస్వామ్య నిరసన హక్కు తీవ్ర ముప్పును ఎదుర్కొంటోందన్నారు. అవాంఛనీయంగా రబ్బరు తూటాలతో దాడికి పోలీసులు తొందరపడ్డారని వ్యాఖ్యానించారు. బీజేడీ ప్రజాస్వామ్యబద్ధమైన ఆందోళన కొనసాగుతుండగా పోలీసులు స్పష్టంగా పక్షపాత ధోరణితో వ్యవహరించారు. అధిక బలప్రయోగంతో రబ్బరు తూటాలతో ఆందోళనకారుల్ని గాయపరచడాన్ని తీవ్రంగా ఖండించినట్లు పేర్కొన్నారు. ఈ చర్య ప్రజాస్వామ్య వ్యవస్థకు ప్రతికూల పరిస్థితుల్ని ప్రేరేపిస్తుందని సూచించారు. ఇటీవల ముఖ్యమంత్రి నివాసం సమీపంలో ఒక సీనియర్ ఐఏఎస్ అధికారి తన బలగాలకు నిరసనకారుల కాళ్లు విరగ్గొట్టమని, ఈ ఘనత సాధించిన వారికి అవార్డులు ఇస్తామని హామీ ఇస్తున్నట్లు సీసీటీవీ కెమెరా రికార్డింగ్ బట్టబయలు చేసిందని నవీన్ వ్యాఖ్యానించారు. బుధవారం జరిగిన ఆందోళనలో ఇద్దరు మాజీ మంత్రుల కాళ్లు విరగొట్టారు. వీరివురికి శస్త్రచికిత్స అవసరం ఉంటుందని భావిస్తున్నారు. పలువురు సీనియర్ నాయకులు, ఒక మహిళా రాజ్యసభ సభ్యురాలు, అనేక మంది పార్టీ కార్యకర్తలను పోలీసులు దారుణంగా కొట్టారు. దీనిపై ప్రభుత్వం వివరణ ఇవ్వాలని నవీన్ పట్నాయక్ కోరారు.

జయపూర్ సమితి చైర్మన్‌పై అవిశ్వాస తీర్మానం



జయపూర్ సబ్ కలెక్టర్‌కు లేఖ అందిస్తున్న సమితి సభ్యులు, సర్పంచ్‌లు

కొరాపుట్: జయపూర్ సమితి చైర్మన్ తిలోత్తమ ముదలిపై అవిశ్వాస తీర్మానం కోసం సభ్యులు విజ్ఞప్తి చేశారు. బుధవారం జయపూర్ సబ్ కలెక్టర్ ఆకవరం సస్యరెడ్డికి లేఖ అందజేశారు. ప్రస్తుత చైర్మన్‌కి బదులు ఆమె భర్త సమితి కార్యాలయంలో అధికారం చెలాయిస్తున్నారన్నారు. మిగతా సమితి సభ్యులు, సర్పంచ్‌లను పట్టించుకోవడం లేదన్నారు. మూడు సంవత్సరాలుగా ఏ కమిటీని పట్టించుకోవడం లేదని వాపోయారు. ప్రభుత్వ నిర్మాణాల నిధులు దుర్వినియోగం అవుతున్నాయన్నారు. వాటిపై పర్యవేక్షణ లేదన్నారు. సమితి వైస్ చైర్మన్ గణేష్ ప్రసాద్ పాడీ, 16 మంది సర్పంచ్‌లు, 19 మంది సమితి సభ్యులు సంతకాలు చేసిన లేఖను అందజేశారు. దీనిపై సబ్ కలెక్టర్ స్పందిస్తూ ప్రభుత్వ నిబంధనల ప్రకారం ముందుకువెళ్తామని వారికి వివరించారు.

4 గంటలు.. నరకం



ముళ్ల పొదల మధ్య నుంచి రైల్వే పట్టాల మీదుగా వెళ్తున్న సైక్లిస్టులు, బాటసారులు

- ఎం.తోటూరు ఎల్‌సీ గేట్‌ను మూసివేసిన రైల్వే అధికారులు
- ఇబ్బందులు పడిన విద్యార్థులు, వాహనచోదకులు

ఇచ్ఛాపురం రూరల్: ఇచ్ఛాపురం రైల్వే ట్రాక్ మరమ్మతుల నేపథ్యంలో బుధవారం మధ్యాహ్నం 3.30 నుంచి రాత్రి 7.30 గంటల వరకు ఎం.తోటూరు వద్ద రైల్వే గేటును మూసివేశారు. దీంతో వాహనచోదకులు తీవర ఇబ్బందులకు గురయ్యారు. నిత్యం వందలాది వాహనాలు రాకపోకలు సాగించే ఈ రహదారిలో నాలుగు గంటల పాటు గేటు వేయడంతో అటువైపుగా వెళ్లే స్కూల్, కాలేజీ బస్సులు ఎక్కడికక్కడ నిలిచిపోవడంతో నరకయాతన పడ్డారు. అండర్ పాసేజ్ మొత్తం వర్షం నీటితో మునిగిపోవడంతో సుమారు ఐదు కిలో మీటర్ల దూరంలో ఉన్న బెన్నుగానిపేట, కేదారిపురం గ్రామాలు మీదుగా వాహనాలు రాకపోకలు సాగించాయి. సైకిల్‌పై వెళ్లే వారు, బాటసారులు తప్పని పరిస్థితుల్లో ప్రాణాలకు తెగించి అండర్ పాసేజ్ పక్కనున్న సందులు గుండా రైల్వే పట్టాలపై నుంచి రాకపోకలు సాగించారు. అయితే ముందస్తుగా నాలుగు గంటల పాటు గేట్‌ను మూసివేస్తున్నట్లు రైల్వే అధికారులు బుధవారం ఉదయం నుంచి ఎల్‌సీ గేటు వద్ద ప్లకార్డులు ప్రదర్శించడంతో వాహనచోదకులు మిన్నకుండిపోయారు.



ఎల్‌సీ గేటును మూసివేసిన దృశ్యం

బైక్‌ల చోరీకి పాల్పడిన నిందితుల అరెస్టు



నిందితులు, దొరికిన వాహనాలతో ఎస్పీ, సిబ్బంది

విజయనగరం క్రైమ్: విజయనగరం వన్‌టౌన్, టూటౌన్ పోలీస్ స్టేషన్‌ల పరిధిలో రాయల్ ఎన్‌ఫీల్డ్ మోటార్ సైకిళ్లను అపహరించిన ఇద్దరు నిందితులను వన్‌టౌన్ పోలీసులు బుధవారం అరెస్ట్ చేశారు. ఈ సందర్భంగా వన్‌టౌన్‌లో ఎస్పీ వకుల్ జిందల్ విలేకరుల ముందు ఇద్దరు నిందితులను ప్రవేశ పెట్టారు.ఈ కేసుకు సంబంధించి ఎస్పీ వకుల్ జిందల్ మాట్లాడుతూ విజయనగరంలోని వీటీ అగ్రహారం బీసీ కాలనీకి చెందిన ఉప్పడాల రాము అలియాస్ డీజే, శ్రీకాకుళం జిల్లా ఆమదాలవలస మండలం ముద్దాడపేటకు చెందిన ముద్దాడ నవీన్ అలియాస్ టైసన్ (19)తో కలిసి 11రాయల్ ఎన్‌ఫీల్డ్ మోటార్ సైకిల్స్, 2 యమహా మోటార్ సైకిళ్లను మారుతాళాలతో దొంగిలించారన్నారు. తరచూ విజయనగరం వన్ టౌన్, టూటౌన్ పోలీస్‌స్టేషన్ల పరిధిలో రాయల్ ఎన్‌ఫీల్డ్ మోటార్ సైకిల్స్ చోరీకి గురవుతున్నాయని ఫిర్యాదులు వస్తున్నాయని వాటికి కారకులైన నిందితులను అరెస్టు చేసేందుకు వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్ పరిధిలో క్రైమ్ ఎస్సై సురేంద్ర నాయుడు బైక్ దొంగతనాలపై తన సిబ్బందితో నిఘా పెట్టారన్నారు. ఈ క్రమంలోనే వీటీ అగ్రహారం బీసీ కాలనీలో నివాసం ఉంటున్న (ఎ1) ఉప్పడాల రాము అలియాస్ డీజేను అరెస్టు చేశామని తెలిపారు. గతంలో కూడా ఉప్పడాల రాము అలియాస్ డీజేపై బైక్ చోరీలకు పాల్పడినట్లు పలు కేసులున్నాయన్నారు. నిందితుడు రాము ఇటీవల జైలు నుంచి విడుదలైన తరువాత మళ్లీ బైక్ చోరీలకు పాల్పడ్డాడని తెలిపారు. ఎ1 ఉప్పడాల రాము నుంచి 7 మోటార్ సైకిల్స్‌ను, ఎ2 ముద్దాడ నవీన్ నుంచి 6 మోటార్ సైకిళ్లు రికవరీ చేశామని చెప్పారు. రికవరీ చేసిన బైక్‌లను కోర్టు ఆదేశాలతో బాధితులకు తిరిగి అందించేందుకు చర్యలు చేపడతామని ఎస్పీ ఈ సందర్భంగా స్పష్టం చేశారు. ఈ కేసులో క్రియాశీలకంగా వ్యవహరించిన విజయనగరం డీఎస్పీ ఎం.శ్రీనివాసరావు, సీఐ ఆర్వీఆర్కే చౌదరి ఆధ్వర్యంలో పని చేసిన వన్ టౌన్ క్రైమ్ ఎస్సై సురేంద్ర నాయుడు, హెచ్‌సీ ఎ.రమణారావు, కానిస్టేబుల్స్ ఎస్.గౌరీశంకర్, పి.శివశంకర్, టి.శ్రీనివాస్, పి.మంజులను ఎస్పీ వకుల్ జిందల్ అభినందించి, ప్రశంసా పత్రాలను అందజేశారు.

నేడు పర్లాకిమిడిలో బంద్



ఆటో ద్వారా ప్రచారం చేస్తున్న దృశ్యం

పర్లాకిమిడి: ఫకీర్ మోహన్ కళాశాల విద్యార్థిని మృత్యువాత పడిన సంఘటనను ఖండిస్తూ గురువారం గజపతి జిల్లా బంద్‌కు కాంగ్రెస్, వామపక్షాలు పిలుపునిచ్చాయి. ఈ మేరకు పట్టణంలో బంద్‌కు వ్యాపార సంస్థలు, ప్రైవేటు బస్సులు సహకరించాలని ఆటో ద్వారా ప్రచారం చేశారు.

కంప్యూటర్ అకౌంటెన్సీ కోర్సుల్లో శిక్షణ

రణస్థలం: ఎచ్చెర్ల మండల కేంద్రంలోని యూనియన్ బ్యాంక్ గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణ సంస్థలో ఈ నెల 23 నుంచి ప్రారంభం కానున్న కంప్యూటర్ అకౌంటెన్సీ కోర్సులో ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు డైరెక్టర్ ఎన్.రామ్‌జీ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉమ్మడి జిల్లాకు చెందిన పదో తరగతి చదివిన, 19 నుంచి 45 ఏళ్ల బీపీఎల్ కేటగిరి మహిళా అభ్యర్థులు అర్హులని పేర్కొన్నారు. 38 రోజులపాటు నిర్వహించే ఈ శిక్షణలో ఉచిత వసతి, భోజన సౌకర్యాలు కల్పిస్తామని, పూర్తి వివరాలకు 77021 80537 నంబరును సంప్రదించాలని కోరారు.

బాలింత మృతితో ఆందోళన

శ్రీకాకుళం క్రైమ్ : నగరంలోని ఓ కార్పొరేట్ ఆసుపత్రిలో బుధవారం వేకువజామున బాలింత చనిపోవడంతో ఆమె కుటుంబీకులు, బంధువులు ఆందోళన చేశారు. బాధితులు తెలిపిన వివరాల ప్రకారం.. ఇచ్ఛాపురం కొత్తపుట్టుగ గ్రామానికి చెందిన నర్సు హైమావతి (25) ఐదారేళ్లుగా పిల్లలు కలగకపోవడంతో శ్రీకాకుళం నగరానికి చెందిన, రాజకీయాల్లో ఉన్న ప్రముఖ వైద్యుడు వద్ద మందులు వాడుతోంది. భర్త విదేశాలకు ఉపాధి నిమిత్తం వెళ్లినా.. పిల్లలు కలగాలనే ఆపేక్షతో గ్రామానికి పలుమార్లు వచ్చి భార్య చికిత్స కోసం నెలకు రూ.50 వేలకు మించి ఖర్చు పెట్టేవారు. ఈ క్రమంలో ఈ నెల 14న హైమావతి బాబుకు జన్మనిచ్చింది. ఈ నెల 15 సాయంత్రం వరకు హైమావతి బాగానే ఉన్నా.. ఆ తర్వాత ఒక్కసారిగా యూరిన్ ఆగిపోవడంతో ఆరోగ్యం క్షీణించింది. మంగళవారం రాత్రి 11 దాటాక చనిపోయింది. శస్త్రచికిత్స వికటించడం వల్లే ఇలా జరిగిందని.. అయినప్పటికీ వైద్యులు బుధవారం వేకువజామున చనిపోయినట్లు ధృవీకరించినట్లు బంధువులు ఆరోపించారు. ఈ మేరకు ఆందోళన చేయడంతో వైద్యుడు చర్చలు జరిపి రాజీ చేసుకోవడంతో వివాదం సద్దుమణిగింది. అప్పటికే పోలీసులకు సమాచారమందినా సెటిల్మెంట్ కావడంతో వారూ వెనుదిరగాల్సివచ్చింది.

భువనేశ్వర్ మెట్రో రైలు ప్రాజెక్టులో కదలిక



ఉప ముఖ్యమంత్రి అధ్యక్షతన అంతర్ మంత్రి మండలి సమావేశం

భువనేశ్వర్: మరుగున పడిన భువనేశ్వర్ మెట్రో రైలు ప్రాజెక్టులో కదలిక ఆరంభమైంది. రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి కనక వర్ధన్ సింగ్ దేవ్ అధ్యక్షతన బుధవారం స్థానిక లోక్ సేవా భవన్ కాన్ఫరెన్స్ హాల్‌లో జరిగిన ఉన్నత స్థాయి సమావేశంలో ఈ ప్రాజెక్టు పురోగతిపై ప్రధానంగా చర్చించారు. ఈ సమావేశం తీర్మానం మేరకు ప్రాజెక్టు కార్యాచరణ కొనసాగించేందుకు ఉప ముఖ్యమంత్రి కనక్ వర్ధన్ సింగ్ దేవ్ అధ్యక్షతన అంతర్ మంత్రిత్వ ఉప సంఘం ఏర్పాటు చేశారు. ఈ కమిటీ ఆధ్వర్యంలో భువనేశ్వర్ మెట్రో రైలు ప్రాజెక్టు పనులు ముందుకు సాగుతాయని ఆశాభావం వ్యక్తం చేశారు. నగరంలో పెరుగుతున్న వాహన రద్దీ నివారణ, నియంత్రణ దృష్ట్యా మెట్రో రైలు ప్రాజెక్టు అవసరమని గుర్తించిన రాష్ట్ర ప్రభుత్వం ఈ ప్రాజెక్టుకు శ్రీకారం చుట్టింది. అస్పష్టమైన కారణాలతో ఈ ప్రాజెక్టు మరుగున పడింది. అంతర్ మంత్రి మండలి దీనిపై చొరవ కల్పించుకుని ముందకు సాగించాలని నిర్ణయించడం విశేషం. ఈ సమావేశంలో మంత్రులు సంపద్ చంద్ర స్వంయి, పృథ్వీరాజ్ హరిచందన్, ఢిల్లీ మెట్రో రైల్ కార్పొరేషన్ సీఈఓ కళ్యాణ్ పట్నాయక్, సీనియర్ అధికారులు వికాష్ కుమార్, ప్రమిత్ గర్గ్ తదితర ప్రముఖులు పాల్గొన్నారు.

రాష్ట్ర పర్యటనలో అస్సాం అసెంబ్లీ పబ్లిక్ అండర్‌టేకింగ్ కమిటీ



రాష్ట్ర శాసన సభ స్పీకర్ సురమా పాఢిని కలిసిన అస్సాం అసెంబ్లీ పబ్లిక్ అండర్‌టేకింగ్ కమిటీ బృందం

భువనేశ్వర్: అస్సాం అసెంబ్లీ పబ్లిక్ అండర్‌టేకింగ్ కమిటీ సభ్యులు రాష్ట్ర పర్యటనకు విచ్చేశారు. ఈ సందర్భంగా బుధవారం ఈ బృందం రాష్ట్ర శాసన సభ స్పీకర్ సురమా పాఢిని కలిశారు. రామేంద్ర నారాయణ్ కలిత ఆధ్వర్యంలో విచ్చేసిన అస్సాం ప్రతినిధి బృందానికి రాష్ట్ర శాసన సభ పనితీరు, రాష్ట్ర అసెంబ్లీ పబ్లిక్ అండర్‌టేకింగ్ కమిటీ యొక్క వివిధ కార్యకలాపాలను చైర్మన్ పద్మలోచన పండా, ఇతర సభ్యులు వివరించారు. అలాగే అస్సాంలో ఈ కమిటీ కార్యకలాపాల్ని తెలుసుకున్నారు. సమగ్రంగా ఉభయ వర్గాల మధ్య సంతృప్తికర చర్చలు కొనసాగాయి. రాష్ట్రంలో 4 ఫైనాన్స్ కమిటీలు, అకౌంట్స్ కమిటీ, ఎస్టిమేట్స్ కమిటీ, పబ్లిక్ అండర్‌టేకింగ్స్ కమిటీ, షెడ్యూల్డ్ తెగలు, షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి కమిటీతో సహా 10 సలహా కమిటీలు, 12 శాసన సభ కమిటీలతో పలు తాత్కాలిక కమిటీలు ఒడిశా అసెంబ్లీలో చురుగ్గా పనిచేస్తున్నట్లు వివరించారు. ఈ సమావేశంలో రాష్ట్ర శాసన సభ కార్యదర్శి సత్యబ్రత్ రౌత్, ఇతర సీనియర్ అధికారులు పాల్గొన్నారు.

నిందితులపై చర్యలు తీసుకోవాలి



కలెక్టర్ కీర్తి వాసన్‌కు వినతిపత్రం అందజేస్తున్న జర్నలిస్ట్ సంఘాల ప్రతినిధులు

కొరాపుట్: జర్నలిస్ట్ హత్యకు గురవడం పట్ల పాత్రికేయ సంఘాలు ఆవేదన వ్యక్తం చేశాయి. కొరాపుట్ జిల్లా కేంద్రంలో జిల్లా కలెక్టర్ వి.కీర్తి వాసన్‌ని ఒడిశా యూనియన్ జర్నలిస్ట్ అసోసియేషన్ జిల్లా కార్యవర్గ ప్రతినిధులు బుధవారం కలిశారు. మల్కన్‌గిరి జిల్లా మొటు సమితి టైమ్స్ ఒడియా వెబ్ చానల్ జర్నలిస్ట్ సి.హెచ్.నరేష్‌ను హత్య చేసిన విషయం గుర్తు చేశారు. ఇంతవరకు జర్నలిస్టులకు బెదిరింపులు, దాడులు జరిగేవని, ఇప్పుడు స్థాయి పెంచి హత్యలు చేస్తున్నారన్నారు. ఈ ఘటనలో నిందితులపై కఠిక చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. జర్నలిస్టుల భద్రతకి ప్రాధాన్యం ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. కలెక్టర్‌ను కలిసిన వారిలో సంఘం సభ్యులు రజేంద్ర గౌడ, రంజన్ దాస్, శశిధర్ రౌత్, సౌమ్య, తదితరులు ఉన్నారు.

నిరుపేద యువతికి అండగా..



వివాహ సామగ్రి అందజేస్తున్న సత్యసాయి సేవా సమితి సభ్యులు

టెక్కలి : టెక్కలిలో సత్యసాయి నిత్యాన్నపూర్ణ సేవా కార్యక్రమంలో పనిచేస్తున్న నిరుపేద వితంతు కొమ్ము జ్యోతి కుమార్తె రవళి వివాహానికి సత్యసాయి సేవా సమితి సభ్యులు తమవంతు సహకారం అందజేశారు. బుధవారం రూ.50 వేల నగదు, పట్టుచీర, పుస్తెల తాడు, వివాహ సామగ్రి అందించారు. సమితి సభ్యులు అన్నపూర్ణ జగదీశ్వరరావు, నాగరాణి, టంకాల నాగరాజు తదితరులు రూ.10 వేలు, మిగిలిన దాతలు రూ.50 వేలు, బెలుసొంటి మధు పట్టుచీర, బంగారు శతమానం సమకూర్చారు. కార్యక్రమంలో యు.భాస్కరరావు, చంటి, ఆర్.ఆదినారాయణ, పి.సూర్యనారాయణ, కె.వేణుగోపాల్, ఎం.ఆదినారాయణ, ఎస్.రాములమ్మ, ఢిల్లేశ్వర్రావు, కోదండరావు, లక్ష్మణరావు, హెచ్.రాజశేఖర్, అప్పారావు, ఎం.తాతయ్య, కె.జగన్మోహన్‌రావు తదితరులు పాల్గొన్నారు.

ఇదేం తీరు..!

- వైద్యారోగ్య శాఖలో బదిలీలపై ఎమ్మెల్యేల అత్యుత్సాహం
- సిఫారసు లేఖల ప్రకారం బదిలీలు చేశారా.. లేదా?
- ఒకవేళ చేయకపోతే ఎందుకు చేయలేదు?
- వివరంగా జాబితాలు పంపాలని ఆదేశం



జిల్లా వైద్యారోగ్య శాఖ కార్యాలయం

అరసవల్లి : కూటమి ప్రభుత్వంలో అధికార పార్టీ ఎమ్మెల్యేల తీరుతో జిల్లా స్థాయి అధికారులు అవస్థలు పడుతున్నారు. పోస్టింగ్‌లకు, బదిలీలకు, ఇతరత్రా పనులకు ఒక్కో ఎమ్మెల్యే తమ ప్రాంతీయులకు అనుకూలంగా సిఫారసు లేఖలు పంపిస్తూ.. ఎలాగైనా చేయాల్సిందే అంటూ పట్టుబడుతున్నారు. తాజాగా జిల్లా వైద్యారోగ్య శాఖలో గ్రామ/వార్డు సచివాలయాల్లో ఏఎన్‌ఎంల బదిలీల ప్రక్రియ జూమ్ విధానంలో వివాదాస్పదంగా జరిగిన సంగతి విదితమే. నేతల ఒత్తిళ్లతో కూడిన సిఫారసు లేఖలు కూడా ఇందుకు ప్రధాన కారణం కాగా.. కార్యాలయంలో ఓ ఇద్దరు కీలక ఉద్యోగుల చేతివాటం మరో కారణమనే ఆరోపణలు వినిపించాయి. మొత్తానికి బదిలీల ప్రక్రియ ఎలాగోలా ముగిసింది. పోస్టింగుల స్థానాలను కేటాయించగా.. చాలావరకు జాయినింగ్‌లు కూడా అయిపోయాయి. ఇప్పుడు మళ్లీ అధికారులకు చేతినిండా పనిపడింది. బదిలీలు చేసిన జాబితాలను తిరగేస్తూ బుధవారం కార్యాలయంలో బిజిబిజీగా కనిపించారు.

జాబితా కోసం...!

గ్రామ/వార్డు సచివాలయాల్లో మొత్తం 605 మందికి బదిలీలు చేశారు. పేరుకు నిబంధనల ప్రకారం చేసామని అధికారులు స్టేట్‌మెంట్లు ఇస్తున్నా.. వాస్తవానికి అందుకు విరుద్ధంగా జరిగాయనేది బహిరంగ సత్యం. బదిలీల ప్రక్రియలో ప్రత్యేకంగా పేర్లతో కూడిన జాబితాలను నేరుగా ఎమ్మెల్యేల సంతకాలతోనే జిల్లా వైద్యారోగ్యశాఖకు పంపించారు. వీరికి మాత్రమే కోరుకున్న స్థానాల్లో బదిలీలు చేయాలని హుకుం జారీ చేశారు. సిఫారసు లేఖల ద్వారా అందిన సుమారు మూడు వందల మందికి పైగా పేర్లలో చాలావరకు ఏఎన్‌ఎంలకు కోరుకున్న స్థానాల్లో బదిలీలు చేశారు. తీరా ఇప్పుడు చూస్తే.. 'అసలు మేం ఇచ్చిన సిఫారసు లేఖల్లో ఎవెరెవరికి బదిలీలు చేశారో..' అన్న జాబితాలను తిరిగి ఎమ్మెల్యే కార్యాలయానికి పంపించాలంటూ మౌఖిక ఆదేశాలు రావడంతో జిల్లా వైద్యారోగ్య శాఖాధికారులు అదే పనిలో పడ్డారు. శ్రీకాకుళం ఎమ్మెల్యే 8, ఎచ్చెర్ల ఎమ్మెల్యే 10, ఆమదాలవలస ఎమ్మెల్యే 22, పాతపట్నం, టెక్కలి, ఇచ్ఛాపురం, పలాస నరసన్నపేట తదితర నియోజకవర్గాల ఎమ్మెల్యేలు సైతం నాలుగైదు విడతలుగా సిఫారసుల లేఖలతో బదిలీలు చేయాలని లేఖలు అందాయి. ఈ లేఖల ప్రకారం ఎవరికి చేయలేదో.. చేయకపోవడానికి కారణాలేంటో లిఖితపూర్వకంగా ఎమ్మెల్యేలకు తెలియాలట! ఇదే పనిలో డీఎంహెచ్‌వో కార్యాలయ పరిపాలనావిభాగం, ఎస్టాబ్లిష్‌మెంట్ విభాగాలు తెగ కష్టపడుతున్నాయి. ఇదీ కూటమి ప్రభుత్వంలో అధికార పార్టీ ఎమ్మెల్యేల తీరు.

క్లుప్తంగా

సర్వజన ఆస్పత్రిలో ఎస్టీ సెల్ ఏర్పాటు



ఎస్టీ సెల్‌ను పరిశీలిస్తున్న డీఎంహెచ్‌ఓ జీవన రాణి

విజయనగరం ఫోర్ట్: ప్రభుత్వ సర్వజన ఆస్పత్రిలో బుధవారం ఎస్టీ సెల్‌ను ఏర్పాటు చేశారు. ఈ విభాగాన్ని డీఎంహెచ్‌ఓ డాక్టర్ ఎస్. జీవనరాణి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఎస్టీ కమిషన్ చైర్మన్ డాక్టర్ డీవీజీ శంకర్ రావు ఆదేశాల మేరకు ఎస్టీ సెల్ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈ సెల్‌లో ఒక డాక్టర్, ఇద్దరు హెల్త్ సూపర్ వైజర్లు, ముగ్గురు ఏఎన్‌ఎంలు విధులు నిర్వహిస్తారని తెలిపారు. ఇక్కడికి వచ్చే గిరిజనులకు అవసరమైన సహాయాన్ని వారు అందిస్తారన్నారు.

14మంది జూదరుల అరెస్టు


పోలీసులు అరెస్టు చేసిన జూదరులు

బొండపల్లి: మండలంలోని వెదురువాడ గ్రామం వద్ద జూదం ఆడుతుండగా 14మందిని బుధవారం అరెస్టు చేసినట్లు ఎస్సై యు.మహేష్ తెలిపారు. వారి నుంచి రూ.లక్షా 1170 నగదు, 9సెల్‌ఫోన్‌లు, 14మోటార్ సైకిల్స్‌ను స్వాధీనం చేసుకుని సీజ్ చేశామన్నారు. పట్టుకున్న వారి పై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు చెప్పారు.

విద్యుత్ స్టేవైరు తగిలి గేదె మృతి


గేదె కళేబరం

సీతానగరం: మండలంలోని తామరఖండి గ్రామంలో ఇళ్ల సర్వీసుల నిమిత్తం విద్యుత్ స్తంభానికి సపోర్టుగా వేసిన విద్యుత్ స్టే వైరు తగిలి రూ.80వేల ఖరీదైన గేదె మృతిచెందింది. ఈ ఘటనపై స్థానికులు అందించిన వివరాలిలా ఉన్నాయి. గ్రామానికి చెందిన పాడి రైతు గుంట్రెడ్డి అప్పలనాయుడికి చెందిన గేదెను మేతకు తోలి ఇంటికి తీసుకువచ్చి ఇంటి ముందున్న తాడుకు కట్టాడు. వర్షం కురుస్తున్న సందర్భంగా నేల నాని పోవడంతో పక్కనే ఉన్న విద్యుత్ స్తంభానికి బిగించిన స్టేవైరుకు పింగాణీ లేక పోవడంతో స్టే వైరుకు ప్రవహించిన విద్యుత్ గేదె మెడ, కొమ్ముకు తగలడంతో మృతిచెందినట్లు తెలియ జేశారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యం


ఎయిర్‌స్ట్రిప్ తుప్పల్లో కుళ్లిన వ్యక్తి మృతదేహం

బాడంగి: మండలంలోని ముగడ పంచాయతీ పరిధి విమానాశ్రయం రన్‌వే గచ్చు తుప్పల్లో కుళ్లిపోయిన గుర్తు తెలియని వ్యక్తి మృతదేహాన్ని స్థానికులు బుధవారం కనుగొన్నారు. ఈ విషయాన్ని వీఆర్‌ఓ ద్వారా పోలీసులకు సమాచార మివ్వగా ఎస్సై తారకేశ్వరరావు సిబ్బందితో సంఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించి మృతదేహం గుర్తు పట్టలేని విధంగా కుళ్లిపోయి కపాలం, ఎముకలు బయటకు కనిపించడంతో ఆ వ్యక్తి సుమారు 15రోజులక్రితమే చనిపోయి ఉంటాడని, ఆయన వయస్సు సుమారు 50–55మధ్య ఉంటుందని అంచనాకు వచ్చారు. తొలుత అనుమానాస్పద మృతిగా భావించి విజయనగరం నుంచి క్లూస్‌టీమ్‌ను రప్పించి పరిశీలించగా మృతదేహం గుర్తుపట్టలేని స్థితిలో ఉండడంతో వారు కూడా చేసేది లేక తిరుగుముఖంపట్టారు. మృతదేహాన్ని ఆస్పత్రికి కూడా తీసుకువెళ్లలేని పరిస్థితుల్లో అక్కడికే స్థానిక సీహెచ్‌సీ వైద్యాధికారి నాగేశ్వరావును రప్పించి పోస్టుమార్టం చేయించి సమీపంలోనే జేసీబీతో గొయ్యితీసి పూడ్చిపెట్టారు. అయితే కొద్దరోజులక్రితం మతిస్థిమితం లేని బిచ్చగాడు ఇటువైపు తిరుగుతుండేవాడని పలువురు చెప్పగా అయి ఉండవచ్చని పోలీసులు భావిస్తున్నారు. ఈ మేరకు ఎస్సై కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నారు.

700 క్యూసెక్కుల నీరు విడుదల

వంగర: మడ్డువలస గొర్లె శ్రీరాములునాయుడు ప్రాజెక్టు కుడి ప్రధాన కాలువకు 700 క్యూసెక్కుల నీటిని విడుదల చేసినట్టు ఏఈ నితిన్ తెలిపారు. ఇప్పటివరకు 600 క్యూసెక్కుల నీటిని ఆయకట్టుకు సరఫరా చేయగా, కాలువ సామర్థ్యమేరకు తాజాగా మరో వంద క్యూసెక్కుల నీటిని పెంచామన్నారు.

గంజాయి నిందితుల ఆస్తులపై విచారణ

- ఎస్పీ వకుల్ జిందల్
- చింతలవలస వద్ద 37.550 కేజీల గంజాయి పట్టివేత


పట్టుబడిన గంజాయి, నిందితులతో ఎస్పీ వకుల్ జిందల్ తదితరులు

డెంకాడ: గంజాయి నిందితుల ఆర్థిక మూలాలపై విచారణ జరిపి ఆస్తులను ఫ్రీజ్ చేస్తామని ఎస్పీ వకుల్ జిందాల్ అన్నారు. ఈ మేరకు డెంకాడ మండలంలోని పినతాడివాడ వద్ద ఉన్న భోగాపురం సీఐ కార్యాలయంలో బుధవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఎస్పీ వకుల్ జిందల్ మాట్లాడారు. మండలంలోని చింతలవలస ఐదవ ఏపీఎస్పీ బెటాలియన్ మెయిన్‌గేట్ సమీపంలో 26వ నంబర్ జాతీయ రహదారిపై మంగళవారం సాయంత్రం కారులో తరలిస్తున్న 37 కేజీల 550 గ్రాముల గంజాయిని పట్టుకున్నట్లు చెప్పారు. కచ్చితమైన సమాచారంతో డెంకాడ పోలీసులు, ఈగల్ పోలీసులు సంయుక్తంగా ఏపీఎస్పీ బెటాలియన్ మెయిన్‌గేట్ సమీపంలో జాతీయ రహదారిపై వాహన తనిఖీలు చేస్తుండగా విజయనగరం నుంచి విశాఖ వెళ్తున్న కారులో 37.550 కేజీల గంజాయి పట్టుబడిందని చెప్పారు. ఒడిశాలో కారులో గంజాయిని లోడ్ చేసి విశాఖకు తరలిస్తుండగా పట్టుబడ్డారని తెలియజేశారు. కారులో గంజాయి తీసుకువెళ్తున్న ఒడిశాకు రాష్ట్రంలోని కొరాపుట్ జిల్లాకు చెందిన బసుదేవ్ సిపా అలియాస్ భాస్కర్ గొల్లారి, అజయ్ గంటలను పట్టుకున్నామని తెలిపారు. వారిద్దరినీ అదే రాష్ట్రానికి చెందిన రాజేష్ అలియాస్ గణేష్ అనే వ్యక్తి రూ.5వేలకు ఎంగేజ్ చేసుకున్నాడని చెప్పారు. రాజేష్‌ను కూడా త్వరలో పట్టుకుంటామన్నారు. ఒడిశా నుంచి వివిధ మార్గాల్లో గంజాయిని హైదరాబాద్, బెంగళూరు, చెన్నై తదితర ప్రాంతాలకు తరలిస్తున్నారని తెలిపారు. ఒడిశా నుంచి గంజాయిని రాష్ట్రంలోకి రాకుండా అడ్డుకునేందుకు పోలీస్ చెక్‌పోస్టులను ఏర్పాటు చేశామన్నారు. అయితే నిందితులు చెక్‌పోస్టులున్నందున లూప్ లైన్లలో రవాణా చేస్తున్నారన్నారు. వాటిపై కూడా ప్రత్యేక నిఘా ఉంచామని తెలిపారు. ఈ మధ్య కాలంలో గ్రీన్‌ఫీల్డ్ హైవే మీదుగా రవాణా చేస్తున్నట్లు గుర్తించామని, దీంతో ఈ ప్రాంతాల్లో కూడా పోలీస్ చెక్‌పోస్టులు ఏర్పాటు చేశామన్నారు. గంజాయి రవాణా చేసినా, నిల్వ ఉంచినా, అమ్మినా చర్యలు కఠినంగా ఉంటాయని హెచ్చరించారు. పట్టుబడిన నిందితులపై గంజాయి కేసుతోపాటు వారి ఆర్థిక మూలలపై కూడా విచారణ జరిపి చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. విజయనగరం పట్టణంలో గంజాయి నివారణకు పూర్తిగా చర్యలు తీసుకున్నామని చెప్పారు. దీనిలో భాగంగా పలువురిని పట్టుకుని కేసులు పెట్టి అరెస్టు చేయడంతో పాటు కఠిన చర్యలు కూడా తీసుకున్నామన్నారు. కేసులో క్రియాశీలకంగా పని చేసిన భోగాపురం సీఐ జి.రామకృష్ణ, ఎస్సై ఎ.సన్యాసినాయుడు, సిబ్బంది, ఈగల్ టీం సిబ్బందిని ఎస్పీ అభినందించారు.

రికార్డుల పరిశీలన

డెంకాడ పోలీస్‌స్టేషన్‌ను ఎస్పీ వకుల్ జిందాల్ సందర్శించిన సందర్భంగా రోడ్డు ప్రమాదాల నివారణకు ముందస్తు చర్యలు చేపట్టాలని సిబ్బందికి సూచించారు. బ్లాక్‌స్పాట్స్ వద్ద హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. హిట్ అండ్ రన్ కేసులు త్వరితగతిన ఛేదించి బాధితులకు న్యాయం జరిగేలా చూడాలని చెప్పారు. పోలీస్టేషన్‌లో వివిధ రికార్డులను, సీడీ ఫైల్స్, జనరల్ డైరీ, బెయిల్ బుక్‌లను పరిశీలించి అధికారులకు సూచనలు చేశారు. కార్యక్రమాల్లో విజయనగరం డీఎస్పీ ఎం.శ్రీనివాసరావు, భోగాపురం సీఐ జి.రామకృష్ణ, ఎస్సై ఎ.సన్యాసినాయుడు తదితరులు పాల్గొన్నారు.

బైక్స్ చోరీకి పాల్పడిన నిందితుల అరెస్టు


నిందితులు, దొరికిన వాహనాలతో ఎస్పీ వకుల్ జిందల్, సిబ్బంది

విజయనగరం క్రైమ్: విజయనగరం వన్‌టౌన్, టూటౌన్ పోలీస్ స్టేషన్‌ల పరిధిలో రాయల్ ఎన్‌ఫీల్డ్ మోటార్ సైకిళ్లను అపహరించిన ఇద్దరు నిందితులను వన్‌టౌన్ పోలీసులు బుధవారం అరెస్ట్ చేశారు. ఈ సందర్భంగా వన్‌టౌన్‌లో ఎస్పీ వకుల్ జిందల్ విలేకరుల ముందు ఇద్దరు నిందితులను ప్రవేశ పెట్టారు.ఈ కేసుకు సంబంధించి ఎస్పీ వకుల్ జిందల్ మాట్లాడుతూ విజయనగరంలోని వీటీ అగ్రహారం బీసీ కాలనీకి చెందిన ఉప్పడాల రాము అలియాస్ డీజే, శ్రీకాకుళం జిల్లా ఆమదాలవలస మండలం ముద్దాడపేటకు చెందిన ముద్దాడ నవీన్ అలియాస్ టైసన్ (19)తో కలిసి 11రాయల్ ఎన్‌ఫీల్డ్ మోటార్ సైకిల్స్, 2 యమహా మోటార్ సైకిళ్లను మారుతాళాలతో దొంగిలించారన్నారు. తరచూ విజయనగరం వన్ టౌన్, టూటౌన్ పోలీస్‌స్టేషన్ల పరిధిలో రాయల్ ఎన్‌ఫీల్డ్ మోటార్ సైకిల్స్ చోరీకి గురవుతున్నాయని ఫిర్యాదులు వస్తున్నాయని వాటికి కారకులైన నిందితులను అరెస్టు చేసేందుకు వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్ పరిధిలో క్రైమ్ ఎస్సై సురేంద్ర నాయుడు బైక్ దొంగతనాలపై తన సిబ్బందితో నిఘా పెట్టారన్నారు. ఈ క్రమంలోనే వీటీ అగ్రహారం బీసీ కాలనీలో నివాసం ఉంటున్న (ఎ1) ఉప్పడాల రాము అలియాస్ డీజేను అరెస్టు చేశామని తెలిపారు. గతంలో కూడా ఉప్పడాల రాము అలియాస్ డీజేపై బైక్ చోరీలకు పాల్పడినట్లు పలు కేసులున్నాయన్నారు. నిందితుడు రాము ఇటీవల జైలు నుంచి విడుదలైన తరువాత మళ్లీ బైక్ చోరీలకు పాల్పడ్డాడని తెలిపారు. ఎ1 ఉప్పడాల రాము నుంచి 7 మోటార్ సైకిల్స్‌ను, ఎ2 ముద్దాడ నవీన్ నుంచి 6 మోటార్ సైకిళ్లు రికవరీ చేశామని చెప్పారు. రికవరీ చేసిన బైక్‌లను కోర్టు ఆదేశాలతో బాధితులకు తిరిగి అందించేందుకు చర్యలు చేపడతామని ఎస్పీ ఈ సందర్భగా స్పష్టం చేశారు. ఈ కేసులో క్రియాశీలకంగా వ్యవహరించిన విజయనగరం డీఎస్పీ ఎం.శ్రీనివాసరావు, సీఐ ఆర్వీఆర్కే చౌదరి ఆధ్వర్యంలో పని చేసిన వన్ టౌన్ క్రైమ్ ఎస్సై సురేంద్ర నాయుడు, హెచ్‌సీ ఎ.రమణారావు, కానిస్టేబుల్స్ ఎన్.గౌరీశంకర్, పి.శివశంకర్, టి.శ్రీనివాస్, పి.మంజులను ఎస్పీ వకుల్ జిందల్ అభినందించి, ప్రశంసా పత్రాలను అందజేశారు.

గ్రోమోర్ సెంటర్‌లో విజిలెన్స్ తనిఖీలు

- రూ.7.50 లక్షల విలువైన స్టాక్‌కు స్టాప్‌సేల్స్ ఆదేశాలు


గ్రోమోర్ సెంటర్‌లో తనిఖీ చేస్తున్న అధికారులు

గంట్యాడ: మండలంలోని కొఠారుబిల్లి జంక్షన్‌లో ఉన్న గ్రోమోర్ సెంటర్‌ను విజిలెన్స్, వ్యవసాయ అధికారులు సంయుక్తంగా బుధవారం తనిఖీ చేశారు. స్టాక్‌కు, ఈపాస్‌లో ఉన్న వివరాలు సమానంగా ఉన్నాయా? లేదా? కాలపరిమితి దాటిన ఎరువులు ఉన్నాయా? అని తనిఖీ చేశారు. మొక్కల ఎదుగుదలకు సంబంధించి వినియోగించే ఉత్ప్రేరకాలు కాలపరిమితి దాటడంతో రూ.7.50 లక్షలు విలువ చేసే స్టాక్‌కు స్టాప్ సేల్స్ ఆర్డర్స్ ఇచ్చారు. నెల రోజులలోగా స్టాక్‌కు సంబంధించి లైసెన్స్ రెన్యువల్ చేసుకోకపోతే 6ఎ కేసు నమోదు చేయాలని ఏఓ శ్యామ్‌కుమార్‌కు విజిలెన్స్ అధికారులు సూచించారు. ఈ తనిఖీల్లో పలాస ఏడీఏ రామారావు, విజిలెన్స్ ఎస్సై అప్పలనాయుడు పాల్గొన్నారు.

జనసేన నాయకుడి దౌర్జన్యం

- పొలం గట్టును కలిపేసి ఆపై రైతుపై దాడి
- ప్రతిఘటించిన బాధిత రైతు కుటుంబం
- ఇరు వర్గాలకు గాయాలు, ఆస్పత్రిలో చికిత్స
- ఆరాతీసిన ఎమ్మెల్యే లోకం నాగమాధవి


జనసేన నేత చేతిలో తలకు గాయాలైన చనమల్లు అరుణ్


గాయపడిన సామంతుల రమణ

నెల్లిమర్ల రూరల్: మండలంలోని మొయిద నారాయణపట్నం గ్రామంలో జనసేన మండల అధ్యక్షుడు పతివాడ అచ్చిం నాయుడు ఓ రైతు కుటుంబంపై దౌర్జన్యానికి పాల్పడ్డాడు. ఈ ఘటనపై స్థానికులు, ఎస్సై గణేష్ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. గ్రామానికి చెందిన అచ్చింనాయుడు, సామంతుల రమణల మధ్య కొంత కాలంగా పొలం గట్టు విషయంలో తగాదాలు జరుగుతున్నాయి. ఈ నేపథ్యంలో జనసేన నేత అచ్చింనాయుడు మంగళవారం ఉదయం రమణ పొలాన్ని ఆక్రమించి గట్టు వేశాడు. ఇదే విషయమై రమణ ప్రశ్నించగా విచక్షణా రహితంగా దాడి చేయడంతో సామంతుల రమణతో పాటు చనమల్లు అరుణ్ తీవ్రంగా గాయపడ్డారు. అనంతరం వారిద్దరూ ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స నిమిత్తం చేరారు. తమ వారిని గాయపరచడంతో అదే రోజు సాయంత్రం గ్రామంలో ఇరువర్గాల మధ్య మళ్లీ ఘర్షణ తలెత్తింది. ఈ ఘర్షణలో అచ్చింనాయుడితో పాటు అవతలి వర్గంలోని పలువురికి గాయాలయ్యాయి.

తనపైనే దాడి అంటూ జనసేన నేత ప్రచారం

తొలుత రైతు కుటుంబాన్ని గాయపరిచిన జనసేన నేత అచ్చింనాయుడు అదేమీ లేదంటూ తనపైనే దాడి చేశారని రాజకీయ కోణంలో సామాజిక మాధ్యమాల్లో విస్తృత ప్రచారం చేశాడు. పోలీసులు వాస్తవాలను తెలుసుకోవడంతో సైలెంట్ అయ్యాడు. ఈ నేపథ్యంలో స్థానిక ఎమ్మెల్యే లోకం నాగమాధవి గ్రామాన్ని సందర్శించి తగాదాపై ఆరాతీశారు. ఇది కేవలం పొలంలో తలెత్తిన గొడవేనని..రాజకీయానికి సంబంధం లేదని ఆమె గుర్తించారు. తమపై దాడి జరిగిన విషయాన్ని పూసగుచ్చినట్లు బాధిత వర్గం ఎమ్మెల్యేకు వివరించింది. దాడి జరిగినప్పుడు చట్టాన్ని చేతుల్లోకి తీసుకోకూడదని, అన్యాయం జరిగినప్పుడు పోలీసులకు ఫిర్యాదు చేయాల్సి ఉందని బాధిత వర్గాన్ని ఎమ్మెల్యే మందలించారు. పరస్పర ఫిర్యాదుల మేరకు ఇరువర్గాలపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై గణేష్ తెలిపారు.

విజయనగరం ఆర్టీసీ డిపో సందర్శన


ఉత్తమ పనితీరు కనబరిచిన సిబ్బందికి ప్రశంసా పత్రాలను అందజేస్తున్న ఆర్టీసీ ఎం.డి ద్వారకా తిరుమలరావు

విజయనగరం అర్బన్: ఆర్టీసీ ఎం,డి ద్వారకా తిరుమలరావు బుధవారం విజయనగరం ఆర్టీసీ డిపోను సందర్శించారు. ఈ సందర్శనలో ఆయన ఆర్టీసీ డిస్పెన్సరీని మార్చడానికి ప్రతిపాదిత స్థలాన్ని పరిశీలించి, దాని సాధ్యాసాధ్యాలపై అధ్యయనం చేశారు. లాజిస్టిక్ కౌంటర్‌లను సందర్శించి బస్‌స్టేషన్‌కు వెళ్లి విద్యార్థులతో బస్సుల సమయపాలన ఎలా ఉందని అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన డిపో సిబ్బందితో సమావేశమై వారి పనితీరును మెచ్చుకున్నారు. అంతేకాక విజయనగరం డిపో పరిధిలో ఉత్తమ పనితీరు కనబరిచిన సిబ్బందికి ప్రశంసాపత్రాలను అందజేశారు. ఉత్తమ సేవలందించిన సిబ్బందిని ప్రోత్సహించడం ద్వారా వారి కృషిని గుర్తించారు. ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడుతూ వచ్చే నెల 15 నుంచి మహిళలకు కల్పించే ఉచిత బస్సు ప్రయాణానికి అన్ని ఏర్పాట్లు చేస్తున్నామని తెలిపారు. ఎలక్ట్రికల్ బస్సులను అందుబాటులోకి తీసుకువస్తున్నట్లు, ప్రస్తుతం నడుపుతున్న బస్సులను కూడా ఎలక్ట్రికల్ బస్సులుగా మార్చేందుకు ఏర్పాట్లు చేస్తున్నామని ప్రయాణికుల సౌకర్యార్థం పల్లెవెలుగు బస్సులను పెంచుతామన్నారు. మహిళా ప్రయాణికులకు ఎటువంటి ఇబ్బంది లేకుండా అన్ని సౌకర్యాలతో ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యం కల్పిస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో విజయనగరం జోన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ కె.బ్రహ్మానందరెడ్డి, విశాఖ జిల్లా ప్రజా రవాణా అధికారి బి.అప్పలనాయుడు, డిప్యూటీ సీటీఎం జి.సత్యనారాయణ, డిప్యూటీ సీఎంఈ కొటాన శ్రీనివాసరావు, విజయనగరం జిల్లా ప్రజా రవాణా అధికారిణి జి.వరలక్ష్మి, ఈఈ అరుణకుమార్, డిపో మేనేజర్ జె.శ్రీనివాసరావు, సెక్యూరిటీ అండ్ విజిలెన్స్ ఆఫీసర్ దుర్గాప్రసాద్, కార్మిక సంఘాల ప్రతినిధులు, కార్మికులు పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ గిరిజన మహిళ మృతి

పాచిపెంట: ఈ నెల ఏడవ తేదీన పురుగు మందు తాగి ఆత్మహత్యాయత్నం చేసిన పాచిపెంట మండలంలోని పి.కోనవలస పంచాయతీ పనసలపాడు గ్రామానికి చెందిన గిరిజన మహిళ పెదకాపు జయమ్మ విజయనగరం సర్వజన ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మంగళవారం రాత్రి మృతిచెందింది. బుధవారం పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం, గ్రామానికి చెందిన పెదకాపు జయమ్మకు రవితో ఏడాది క్రితం వివాహం అయింది. అనంతరం వారికి ఒక మగబిడ్డ పుట్టి అనారోగ్య కారణాలతో మరణించాడు. నాటినుంచి మానసిక వేదనకు గురైన జయమ్మ తన భర్త ఇంట్లో లేని సమయంలో పురుగు మందు తాగి ఆత్మహత్యాయత్నం చేసింది. విషయం తెలుసుకున్న కుటుంబసభ్యులు వెంటనే విజయనగరం ప్రభుత్వాస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతిచెందింది. మృతురాలి తల్లి సామాలమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై వెంకట సురేష్ తెలిపారు.

విద్యను జాతీయం చేయాలి

- పీపుల్స్‌స్టార్ ఆర్.నారాయణమూర్తి


మాట్లాడుతున్న పీపుల్స్‌స్టార్ ఆర్.నారాయణమూర్తి

పార్వతీపురం రూరల్: ఆటంబాంబులు, సునామీల కంటే పేపర్ లీక్ సమాజానికి, వ్యవస్థకు ఎంతో హానికరం అని పీపుల్స్‌స్టార్ ఆర్.నారాయణమూర్తి అన్నారు. ఈ మేరకు బుధవారం పార్వతీపురం వచ్చిన ఆయన ఆగస్టు 22న విడుదల కానున్న తన 'యూనివర్సిటీ పేపర్ లీకేజ్' చిత్రం ప్రమోషన్ మేరకు జిల్లా కేంద్రంలోని పలువురు రాజకీయ నాయకులను పట్టణ ప్రముఖులను కలిశారు. ఈ సందర్భంగా ఆర్.నారాయణ మూర్తి మాట్లాడుతూ గత కొన్నేళ్లుగా విద్యారంగంలో జరుగుతున్న పేపర్ లీక్ వల్ల జరిగే నష్టాలను చర్చిస్తూ తాను యూనివర్సిటీ పేపర్ లీక్ సినిమాను తెరకెక్కించినట్లు తెలిపారు. గ్రూప్ 1, 2 పరీక్షల్లో అలాగే పలు ప్రధాన పరీక్షల్లో ప్రశ్నపత్రాల్ని లీక్ చేయడం చూస్తుంటే విద్యార్థులు, నిరుద్యోగుల జీవితాలు ఏమైపోతాయో అనే భయం కలుగుతోందని ఆందోళన వ్యక్తం చేశారు. కాపీయింగ్ చేసి మార్కులు తెచ్చుకున్న వారు డాక్టర్లు అయితే రోగుల ప్రాణాలకు భరోసా ఉండదని, అలాంటి వాళ్లు ఇంజనీర్లు అయితే బ్రిడ్జిలు ఎలా నిలబడతాయని ఆర్.నారాయణమూర్తి ప్రశ్నించారు. ఇలాంటి దారుణాలు జరగకూడదంటే పేపర్ల లీక్‌లను అరికట్టాలని, విద్యను జాతీయం చేసి ప్రైవేట్ మాఫియా నుంచి విముక్తి చేయాలని ఆయన కోరారు.

పోలీస్ సిబ్బందికి వైద్యపరీక్షలు

విజయనగరం క్రైమ్:

రాష్ట్ర డీజీపీ హరీష్కుమార్ గుప్తా ఆదేశాల మేరకు జిల్లా పోలీస్ సిబ్బందికి వైద్యపరీక్షలు నిర్వహిస్తున్నట్టు ఎస్పీ వకుల్ జిందల్ తెలిపారు. జిల్లా పోలీస్ కార్యాలయంలో బుధవారం నిర్వహించిన వైద్యశిబిరాన్ని, సేవల తీరును ఆయన పరిశీలించారు. ఉద్యోగుల ఆరోగ్యమే లక్ష్యంగా అధికారి నుంచి హోంగార్డు వరకు అందరికీ వైద్యపరీక్షలు చేయిస్తామన్నారు. సుగర్, రక్తం, లిపిడ్ ప్రొఫైల్ (కొలెస్ట్రాల్), సీరం క్రియేట్ (కిడ్నీ), ఈసీజీ వంటి పరీక్షలు ఉచితంగా నిర్వహించి అవసరమైన మందులతో పాటు వైద్యచికిత్స అందిస్తామని చెప్పారు. దీనికోసం ప్రత్యేకంగా వైద్యులను ఏర్పాటుచేసినట్టు వెల్లడించారు. జిల్లా పోలీస్ శాఖలో పనిచేస్తున్న మొత్తం 2000 మందికి ఈ నెలాఖరులోగా వైద్య పరీక్షలు పూర్తి చేసేలా ప్రణాళిక రూపొందించామని, ఉద్యోగులందరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

పోలీస్ ఉద్యోగుల సౌలభ్యం కోసం జిల్లా కేంద్రంలోని మెడికవర్, స్కాన్యూ టేజ్లోను, బొబ్బిలిలోని క్వీన్ ఎన్ఆర్ఐ, రాజాంలోని జీఎంఆర్ వరలక్ష్మి కేర్ ఆస్పత్రుల్లో వైద్యపరీక్షలు జరుగుతాయన్నారు. కార్యక్రమంలో అదనపు ఎస్పీ (అడ్మిన్) పి.సౌమ్యలత, అదనపు ఎస్పీ (ఏఆర్) జి.నాగేశ్వరరావు, వైద్యులు మల్లికార్జున రెడ్డి, అఖిల్, రాజేష్, వి.గోవర్ధన్, సిరి కృష్ణ, ఏఆర్ డీఎస్పీ వై.రవీంద్ర రెడ్డి, ఎస్బీ సీఐలు పాల్గొన్నారు.

అదిగో చినుకు..
ఊరిస్తోంది ఇంకా!

- జూలై సగం గడిచినా ఇంకా లోటు వర్షపాతమే..
- ఖరీఫ్ పనులకు వెనకడుగు వేస్తున్న రైతులు
- ఎండిపోతున్న ఆశలు


నారు సిద్ధమైనా నీరు లేక నాట్లు వేయలేని పరిస్థితి

సాక్షి, పార్వతీపురం మన్యం:

ఖరీఫ్ పనులకు కొద్దిరోజుల ముందు వర్షాలు వారం రోజులపాటు కురిస్తే రైతులు మురిసిపోయారు. వ్యవసాయ పనులు మొదలు పెట్టేశారు. తీరా.. ఇప్పుడు వానలు ముఖం చాటేశాయి. వేసవిని తలపిస్తూ ఎండలు మండుతున్నాయి. ఉదయం ఎండ వేడిమి.. సాయంత్రం నాలుగు చినుకులు.. రాత్రయితే ఉక్కపోత.. ఇదీ జిల్లాలో పరిస్థితి. కొద్దిరోజులుగా వేసవిని తలపిస్తున్న ఎండలతో నారుమడులు ఎండుతున్నాయి. దూర ప్రాంతాల నుంచి నీటిని తెచ్చి రైతులు వరి నారుమడులు తడుపుతున్నారు. జిల్లాలో ఈ నెల 16న 19.1 మి.మీ. సగటు వర్షం కురిసింది. ఇందులో మక్కువ, సీతానగరం, పాలకొండ, కొమరాడ, బలిజిపేట ప్రాంతాల్లో మోస్తరు వర్షపాతం నమోదు కాగా.. కురుపాం, జియ్యమ్మవలస, పార్వతీపురం, పాచిపెంట తదితర మండలాల్లో చినుకు జాడలేదు. జిల్లాలో ఈ ఏడాది జూన్ నుంచి జులై 16వ తేదీ వరకు 247.6 మి.మీ. సాధారణ వర్షపాతం నమోదు కావాల్సి ఉండగా.. కేవలం 201 మి.మీ. కురిసింది. గతేడాది ఇదే సమయంలో 264 మి.మీ సగటు వర్షపాతం నమోదైంది. రుతు పవనాలు తొందరగానే ప్రవేశించాయని.. ఇంక వానలే వానలని అనుకున్న రైతులకు నిరాశే మిగిలింది.

ఖరీఫ్‌పై ప్రభావం

జిల్లాలోని 15 మండలాల పరిధిలో ఖరీఫ్ సీజన్‌లో 2.20 లక్షల ఎకరాల్లో వరితోపాటు, ఇతర ప్రధాన పంటలు సాగవుతాయి. ప్రస్తుతం పంటలకు నీరు అవసరం. కొన్ని మండలాల్లో అడపాదడపా వర్షం కురుస్తున్నా.. మరికొన్ని మండలాల్లో పూర్తిగా ఎండ కాస్తోంది. నీటి వనరులున్నా.. ప్రభుత్వ వైఫల్యం కారణంగా సాగుకు ఇవ్వలేని పరిస్థితి. ప్రస్తుతం ఖరీఫ్‌కు సంబంధించి నీరు రాకపోతే నారుమడులు వేసిన రైతులు నష్టపోతారు. నీటి వనరులున్న చోటు ఉడుపులు అవుతున్నాయి. వర్షాలు ఆలస్యమై పైరు దెబ్బతింటుంది. దీనివల్ల వెదలు జల్లడం లేదు. సాధారణంగా ఈ సమయంలో ఉభాలకు పూర్తిస్థాయిలో సిద్ధమవ్వాలి. దమ్ములు కూడా మొదలవ్వాలి. మరోవైపు యూరియా కొరత వేధిస్తోంది. ఈ సమయంలో యూరియా అందకపోతే మొక్క ఎదుగుదల మీద ప్రభావం పడుతుంది. ఓ వైపు వర్ష ప్రభావం, ఇంకోవైపు ప్రభుత్వ యంత్రాంగం నిర్లక్ష్యం కారణంగా రైతులకు ఇబ్బందులు తప్పడం లేదు.

వర్షపాతం ఇలా...

గత ఏడాది జూన్, జూలై నెలల్లో (ఇదే సమయానికి) 247.6 మి.మీ సాధారణ వర్షపాతానికి గాను 264 మి.మీ సగటు వర్షపాతం నమోదైంది. అంతకు ముందు 2023లో ఇదే సమయానికి 307.01 మి.మీ. సగటు వర్షపాతం నమోదైంది.

ఈ ఏడాది జూన్, జులై నెలల్లో నమోదైన సగటు వర్షపాతం వివరాలు

మండలం	సాధారణం	కురిసింది(మి.మీ)
వీరఘట్టం	247.5	218.9
సీతంపేట	322.2	123
భామిని	263.3	99.8
పాలకొండ	246.7	213.6
కొమరాడ	271.2	282.7
జీఎల్‌పురం	248.8	151.5
కురుపాం	209.9	229.3
జియ్యమ్మవలస	253.9	298.4
గరుగుబిల్లి	255.8	106.8
పార్వతీపురం	264.3	321.3
మక్కువ	232.8	203.8
సీతానగరం	237.3	205.6
బలిజిపేట	202.9	224.2
సాలూరు	235.7	192.7
పాచిపెంట	222	139.1


అరకొర నీటితోనే దమ్ము